# ఇంజనీరింగ్ సీట్లు నిండేనా?

**1,12,069**
రాష్ట్రంలో ఇంజనీరింగ్ కాలేజీల్లో మొత్తం సీట్లు..



- తెలంగాణలో ఏటా 50 వేల మంది ఏపీ విద్యార్థులకు సీట్లు
- ఈ ఏడాదితో ఏపీ నాన్ లోకల్ కోటా గడువు పూర్తి .. ఇంజనీరింగ్‌లో ఆ మేరకు డిమాండ్ తగ్గే చాన్స్
- రాష్ట్రపతి ఆదేశాల తర్వాతే కోటా రద్దుకు జీవో
- ఇంకా అధికారికంగా కోరని రాష్ట్ర ప్రభుత్వం
- జీవో వచ్చిన తర్వాతే ఎప్‌సెట్ నోటిఫికేషన్

సాక్షి, హైదరాబాద్

రాష్ట్రంలో ఇంజనీరింగ్ కాలేజీల్లో సీట్లకు ఈసారి దరఖాస్తులు తగ్గే అవకాశం ఉంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విభజన సమయంలో ఉన్న రాష్ట్రపతి ఉత్తర్వుల ప్రకారం తెలంగాణలో ఏపీ విద్యార్థులకు నాన్‌లోకల్ కోటా కింద 15 శాతం సీట్లు లభించేవి. ఆ కాలపరిమితి గత ఏడాదితో ముగిసింది. దీంతో వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఆ కోటాను తీసివేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఏటా ఏపీ నుంచి దాదాపు 50 వేల మంది విద్యార్థులు తెలంగాణలో ఇంజనీరింగ్ సీట్ల కోసం పోటీ పడతారు. ఇందులో 16 వేల సీట్ల వరకు నాన్–లోకల్ కోటా కింద, మిగతావి జనరల్ పోటీలో ఏపీ విద్యార్థులు దక్కించుకుంటారు. ఇప్పుడు ఏపీ స్థానికతను అనుమతించకపోతే రెండు కేటగిరీల్లోనూ ఆ రాష్ట్ర విద్యార్థులకు సీట్లివ్వరు. యాజమాన్య కోటా సీట్లు మాత్రమే వారికి అందుబాటులో ఉంటాయి. అయితే, ఏపీ నాన్‌లోకల్ కోటా ఎత్తివేతకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక జీవో ఇవ్వాల్సి ఉంది. ఆ తర్వాతే ఎప్‌సెట్ నోటిఫికేషన్ విడుదల చేయాలని అధికారులు

మిగతా 3వ పేజీలో ▶

# ఇంజనీరింగ్ సీట్లు నిండేనా?

▶ మొదటి పేజీ తరువాయి

నిర్ణయించారు. గత ఏడాది ఎప్‌సెట్‌లో ఇంజనీరింగ్ విభాగానికే 2.40 లక్షల దరఖాస్తులు వచ్చాయి. ఇందులో 1.80 లక్షల మంది సెట్‌లో అర్హత పొందారు.

**సీట్లకు డిమాండ్ తగ్గుతుందా?**

రాష్ట్రంలో 174 ఇంజనీరింగ్ కాలేజీలున్నాయి. వీటిల్లో మొత్తం 1,12,069 సీట్లున్నాయి. కన్వీనర్ కోటా కింద 70 శాతం సీట్లు భర్తీ చేస్తారు. 30 శాతం యాజమాన్య కోటా కింద భర్తీ అవుతాయి. గత ఏడాది మరో 3 వేల సీట్ల పెంపునకు అఖిల భారత సాంకేతిక విద్యా మండలి అనుమతిచ్చినా, ప్రభుత్వం అనుమతివ్వకపోవటంతో కాలేజీలు కోర్టుకెళ్లి అనుమతి తెచ్చుకున్నాయి. దీంతో ఆ 3 వేల సీట్లను ఈసారి ఎప్‌సెట్ కౌన్సెలింగ్‌లో అనుమతించాల్సి ఉంటుంది. ఏపీ విద్యార్థులు తగ్గడం, కొత్తగా సీట్లు పెరగడంతో ఈసారి ఇంజనీరింగ్ సీట్లకు డిమాండ్ తగ్గే అవకాశం ఉందని అధికారులు అంటున్నారు. రాష్ట్రంలో 58 శాతం ఇంజనీరింగ్ సీట్లు సీఎస్ఈ, కంప్యూటర్ అనుసంధాన డేటాసైన్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సైబర్ సెక్యూరిటీ వంటి కోర్సుల్లోనే ఉన్నాయి. వీటికి డిమాండ్ ఎక్కువగా ఉంది. ఈ సీట్లను తెలంగాణ విద్యార్థులు కొంత తేలికగానే పొందే వీలుంది.

**వెంటాడుతున్న న్యాయ సమస్యలు**

రాష్ట్ర విభజన సమయంలో పదేళ్లపాటు నాన్–లోకల్ కోటా అమలుకు రాష్ట్రపతి ఉత్తర్వులు ఇచ్చారు. గత ఏడాది ఎప్‌సెట్ నోటిఫికేషన్ సమయానికి పదేళ్లు పూర్తి కాలేదు కాబట్టి నాన్-లోకల్ కోటా అమలు చేశారు. అయితే, నాన్-లోకల్ కోటా ఎత్తివేసే ముందు రాష్ట్రపతి అనుమతి అవసరమని అధికారులు చెబుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకూ ఈ విషయాన్ని రాష్ట్రపతి భవన్‌కు అధికారికంగా తెలియజేయలేదు. రాష్ట్రపతి అనుమతి వచ్చిన



తర్వాత మాత్రమే కోటా ఎత్తివేత జీవో ఇవ్వాలి. లేని పక్షంలో ఎవరైనా కోర్టుకెళ్తే న్యాయపరమైన చిక్కులు తప్పవని అధికార వర్గాలు అంటున్నాయి.

**ప్రభుత్వానికి తెలిపాం**

నాన్-లోకల్ కోటా ఎత్తివేత జీవో వచ్చిన తర్వాత నోటిఫికేషన్ ఇవ్వాల్సి ఉంటుంది. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం. విధి విధానాలు ఏ విధంగా ఉంటాయనేది ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చాక తెలుస్తుంది. ఇందుకు తగ్గట్టుగానే నిర్ణయాలు తీసుకుంటాం. - ప్రొఫెసర్ వి బాలకిష్టారెడ్డి, ఉన్నత విద్యా మండలి చైర్మన్

| సంవత్సరం | మొత్తం కాలేజీలు | ప్రభుత్వ కాలేజీల్లో సీట్లు | ప్రైవేటు కాలేజీల్లో సీట్లు | మొత్తం సీట్లు | ప్రవేశాలు | శాతం |
|---|---|---|---|---|---|---|
| 2020-21 | 186 | 3,151 | 95,837 | 98,988 | 65,720 | 66.39 |
| 2021-22 | 180 | 4,069 | 1,05,704 | 1,08,773 | 77,700 | 70.54 |
| 2022-23 | 178 | 4,825 | 1,03,890 | 1,11,769 | 82,350 | 76.37 |
| 2023-24 | 175 | 5,667 | 1,11,769 | 1,17,426 | 91,001 | 77.50 |
| 2024-25 | 174 | 5,907 | 1,05,573 | 1,12,069 | 95,230 | 78.05 |

# జేఎన్‌టీయూహెచ్‌లో సంతు సేవాలాల్ జయంతి వారోత్సవాలు

కేపీహెచ్‌బీకాలనీ, ఫిబ్రవరి 13 (ఆంధ్రప్రభ): బంజారాల ఆరాధ్యదైవం సంత్ శ్రీశ్రీ సేవాలాల్ మహారాజ్ జయంతి వారోత్సవాలను గురువారం జేఎన్‌టీయూహెచ్‌లో రిజిస్టార్ వెంకటేశ్వర రావు ప్రారంభించారు. విశ్వవిద్యాలయంలో క్రీడ ఉత్సవాలను ఘనంగా జరుపుకోవాలని మెకానికల్ హెచ్‌ఓడి డా.రాంజీనాయక్, ప్రొఫెసర్ గిరిధర్ తెలిపారు. నేటి నుండి క్రికెట్, చదరంగం, క్యారం, షాట్‌పుట్, త్రోబాల్, హ్యాండ్‌బాల్, వ్యాసరచన, ముగ్గుల పోటీలు ఉంటాయని ఎస్సీఎస్టీసెల్ కోఆర్డినేటర్ ప్రో.మాధవికుమారి తెలిపారు. ఈ కార్యక్రమంలో బంజారా విద్యార్థి సంఘం నాయకులు ధారవత్ నరేందర్ నాయక్, భూక్యారాజ్‌కుమార్, భాను ప్రకాష్, వినోద్‌నాయక్, బానోత్ ఆకాశ్ నాయక్, సింహాద్రినాయక్, శశికుమార్, గౌతమ్, సురేష్, ప్రణీత, అనూష, లైలా, సంధ్య, వైశాలి తదితరులు పాల్గొన్నారు.



సేవాలాల్ జయంతి వారోత్సవాల ప్రారంభోత్సవంలో రిజిస్టార్ వెంకటేశ్వరరావు తదితరులు

న్యాక్ గుర్తింపులో

# బైనరీ, ఎంబీజీఎల్ విధానాలు

- బైనరీలో అక్రిడిటేషన్ ఉన్నవి.. లేనివిగా విద్యాసంస్థలకు గుర్తింపు
- అక్రిడిటేషన్ ఉన్నవాటికి 1 నుంచి 5 వరకు 'లెవల్స్'
- ఏప్రిల్-మే నుంచి కొత్త విధానం

ఈనాడు, హైదరాబాద్: దేశవ్యాప్తంగా ఉన్నత విద్యాసంస్థలకు ఇచ్చే జాతీయ గుర్తింపు, మదింపు కమిటీ (న్యాక్) గ్రేడింగ్‌లో కీలక మార్పులు రానున్నాయి. ఏప్రిల్- మే నెల నుంచి గ్రేడింగ్‌లో బైనరీ విధానాన్ని అమలు చేయాలని న్యాక్ నిర్ణయించింది. దీనిప్రకారం విద్యాసంస్థలు ఇకపై అక్రిడిటేషన్ ఉన్నవి, లేనివి మాత్రమే ఉంటాయి. మరింత ముందుకు వెళ్లాలనుకునే అక్రిడిటేషన్ ఉన్న విద్యాసంస్థలకు మెచ్యూరిటీ బేస్డ్ గ్రేడెడ్ లెవెల్స్ (ఎంబీజీఎల్) ఇస్తారు. ఇందులో ఒకటి నుంచి ఐదు లెవెల్స్ ఉంటాయి. వాటికి విధివిధానాల రూపకల్పనకు న్యాక్ ప్రత్యేక కమిటీలను నియమించింది.




ఇటీవల ఏపీలోని కేఎల్ వర్సిటీ న్యాక్ గ్రేడింగ్ కోసం కమిటీ సభ్యులకు పెద్ద ఎత్తున లంచాలు ఇచ్చిందని సీబీఐ విచారణలో తేలడం.. పలువురిని అరెస్టు చేయడం సంచలనం రేపింది. ఈక్రమంలోనే కొత్త విధానాన్ని తెస్తున్నట్లు తాజాగా న్యాక్ వెల్లడించింది. ప్రస్తుతం న్యాక్ గ్రేడ్ ఉంటే అది కొనసాగుతుంది. కొత్తగా కావాలనుకునే వారికి నూతన విధానాన్ని అమలు చేస్తారు.

## 2022 నుంచి కసరత్తు...

ప్రస్తుతం కళాశాలలకు, వర్సిటీలకు ఎనిమిది స్థాయుల గ్రేడింగ్‌లు ఇస్తున్నారు. ఉత్తమ గ్రేడింగ్ కోసం కొన్ని విద్యాసంస్థలు.. తనిఖీలకు వచ్చే కమిటీ సభ్యులను ప్రలోభాలకు గురిచేస్తున్నాయని.. తగిన మౌలిక వసతులు లేకున్నా ఉన్నట్లు చూపుతూ మోసం చేస్తున్నాయని తరచూ ఆరోపణలు వస్తున్నాయి. ఈక్రమంలోనే 2022లో కేంద్ర విద్యాశాఖ తొలుత మూడు కమిటీలను నియమించింది. అదే ఏడాది నవంబరులో ఇస్రో మాజీ ఛైర్మన్ డాక్టర్ కస్తూరి రంగన్ ఛైర్మన్‌గా మరో కమిటీని నియమించింది. ఆ కమిటీ 2023 ఆగస్టులో నివేదిక అందజేసింది. ఆ కమిటీ సూచనల మేరకు.. బైనరీ, ఆ తర్వాత ఎంబీజీఎల్ విధానం అమలుకు కేంద్రం సమాయత్తమైంది.

## ప్రస్తుతం ఎనిమిది రకాల గ్రేడ్లు..

ప్రస్తుతం విద్యాసంస్థలు పొందిన పాయింట్ల ఆధారంగా ఎనిమిది రకాల గ్రేడ్లు ఇస్తున్నారు. ఏ++, ఏ+, ఏ, బీ++, బీ+, బీ, సీ, డీ గ్రేడ్లు ఉన్నాయి. డీ అంటే గుర్తింపు పొందలేదని అర్థం. తెలంగాణలో 2024 డిసెంబరు 13వ తేదీ నాటికి 16 వర్సిటీలు, 344 కళాశాలలకు, ఏపీలో 22 వర్సిటీలు, 481 కళాశాలలకు న్యాక్ గ్రేడ్లు ఉన్నాయి.

# క్రీడోత్సవాలు ప్రారంభం

కూకట్‌పల్లి, న్యూస్‌టుడే: సంత్ సేవాలాల్ జయంతి వారోత్సవాల్లో భాగంగా బంజారా విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో గురువారం జేఎన్‌టీయూహెచ్ మైదానంలో క్రీడోత్సవాలను రిజిస్ట్రార్ డా. కె. వెంకటేశ్వరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా సంత్ సేవాలాల్ చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి ఉత్సవాలను మొదలుపెట్టారు. వాలీబాల్, క్రికెట్, క్యారమ్స్, చెస్, షాట్‌పుట్, త్రోబాల్, హ్యాండ్ బాల్, వ్యాసరచన, ముగ్గుల పోటీలు నిర్వహించనున్నారు.

ఈ కార్యక్రమంలో మెకానికల్ విభాగాధిపతి డా. రాంజీనాయక్, ప్రొ. గిరిధర్, ఎస్సీ, ఎస్టీ సెల్ సమన్వయకర్త మాధవీ కుమారి, బంజారా విద్యార్థి సంఘం ఛైర్మన్ నరేందర్ నాయక్, వ్యవస్థాపకుడు రాజ్‌కుమార్, అధ్యక్షుడు వినోద్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.



**జేఎన్‌టీయూహెచ్ మైదానంలో రిజిస్ట్రార్ వెంకటేశ్వరరావు, బంజారా విద్యార్థి సంఘం నాయకులు**